క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సోమఘట్టలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

చిలమత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీతో కలిసి పంచాయతీల వారీగా సమీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. జగనన్న కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించారన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా ప్రజలను అభ్యర్థించాలన్నారు. టీడీపీ నాయకులు గత ప్రభుత్వంలో చేసిన అవినీతి అక్రమాలను ప్రజలకు వివరిస్తూనే వాళ్లు అధికారంలోకి వస్తే జరిగే నష్టాన్ని వివరించాలని సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో సీఐ రాజశేఖర్‌గౌడ్, సిబ్బంది

హిందూపురం అర్బన్: పోచనపల్లి రోడ్డుపై పెన్నా బ్రిడ్జి వద్ద గురువారం సెబ్ ఎస్ఐలు రామప్రసాద్, కమలాకర్ 12 బాక్సుల కర్ణాటక మద్యం ((1,152 హైవార్డ్స్ ప్యాకెట్లు) పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న వ్యక్తితోపాటు స్కూటర్, మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. అలాగే లేపాక్షి మండలం మామిడిమాకులపల్లికి చెందిన వ్యక్తి 4 బాక్సుల్లో తరలిస్తున్న 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేపు వారపు సంత, చింత ఫలసాయం వేలం

అమరాపురం: అమరాపురం పంచాయతీలోని చింత ఫలసాయం, వారపు సంత, బస్టాండ్, దినసరి సంత, జంతు వధశాల (మటన్ మార్కెట్)ను ఈనెల 23న గ్రామ సచివాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

ఉద్యాన కోర్సులపై అవగాహన



కూరగాయ సాగులో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా జీవీపాళ్యం గ్రామంలో ఉద్యాన కోర్సులు, పంటల సాగు, కూరగాయ సాగులో విత్తన శుద్ధి ప్రాముఖ్యతపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులు పూర్తి చేసిన వారు ఎందరో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. విత్తన శుద్ధి చేసుకొని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి పొందొచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్‌కుమార్, రైతులు, మహిళలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదు గురిని బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ,కాంగ్రెస్ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నాయకులు

మడకశిర: పట్టణంలోని దాల్‌మిల్‌లో జిల్లేడు గుంటకు చెందిన టీడీపీ,కాంగ్రెస్ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో బుధవారం రాత్రి చేరారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. హనుమంతస్వామి, లక్ష్మీకాంత్, నారాయణప్ప, అడివన్న, హనుమంతేగౌడ్, రామకృష్ణ, గోవిందప్ప, నరసింహప్ప తదితరులు టీడీపీ, కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.

సంక్షేమ ప్రభుత్వానికే పట్టం కట్టండి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్



కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికే మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకునే పార్టీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవలం ఎన్నికల కోసం జెండాలతో జతకట్టే పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నలభై సంవత్సరాలుగా గ్రామంలో నెలకొన్న లో ఓల్టేజీ విద్యుత్ సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బూత్ కమిటీ సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, సర్పంచ్ శ్యామలా బాయి, ఎంపీటీసీ జ్యోతి బాయి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శ్యామునాయక్, సచివాలయ కన్వినర్ రామ్మోహన్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గంగిరెడ్డి, అంజినరెడ్డి, సాయిరాం నాయక్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

పెనుకొండ రూరల్: మండలంలోని హనుమప్పల్లిలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ రామాంజనేయులు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం

సోమందేపల్లి: తాము ఎప్పటికీ వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని తుంగోడు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు స్పష్టం చేశారు. గురువారం 12 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ సమక్షంలో తిరిగి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండలంలోని కావేటినాగేపల్లిలో శుభకార్యం ఉందని టీడీపీ నాయకులు ఆహ్వానిస్తే వెళ్లామని తెలిపారు. అక్కడికి వెళ్లగానే టీడీపీ కండువాలు వేశారని పేర్కొన్నారు. తామంతా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, స్థానిక నాయకులు విజయ్, సూర్యప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



హాజరైన ప్రజలు

గుడిబండ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మోపరగుండు గ్రామంలో 'మేము సిద్ధం– మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని సర్పంచ్ కరుణాకర్‌గౌడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళినితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 58 నెలల కాలంలో రాష్ట్రంలో 99 శాతం సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదలకు లబ్ధి చేకూర్చారన్నారు. భూటకపు హామీలతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ కలిసి వస్తున్నారన్నారు. ఎన్ని హామీలు ఇచ్చిన కూడా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని గుర్తు చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సచివాలయాల తీసుకొచ్చి, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వార్డు మెంబర్లు తదితరులు 58 నెలల కాలంలో ప్రభుత్వం కల్పించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీ భూతరాజు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో ఈరలక్కప్ప ప్రచారం

మడకశిర: పట్టణంలోని 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి గురువారం ప్రచారం చేశారు. ఈవార్డుకు చెందిన ఆటో డ్రైవర్ అంజి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ నాగేంద్ర, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, సచివాలయం కన్వీనర్ గోపి,స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరంగారెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈరలక్కప్పకు మద్దతు: పట్టణంలోని ముస్లింలు అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఫకృద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

మడకశిరరూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. గురువారం సాయంత్రం ఎగువ అచ్చంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం రాజుస్వామి, గురురాజుస్వామి ఇంటిలో సమావేశమై, పార్టీ గెలుపుపై చర్చించారు. అనంతరం టీడీపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి 30 కుటుంబాలకుపైగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. మడకశిరలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలోకి చేరినవారు తెలిపారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజుగౌడ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా పబ్లిసిటీ అధ్యక్షులు వెంకటరంగారెడ్డి, వివిధ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి



పరామర్శిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

పెనుకొండ: పెనుకొండ కోర్టుకు సంబంధించి గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్‌లో సభ్యుల నెలవారీ, సంవత్సర చందాల విషయం నోటీసుల ద్వారా తెలిపినా ఓటరు లెక్కలు చెప్పలేదన్నారు. అధ్యక్షుడైన తనతో సంప్రదించకుండానే కొందరు న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు జరిపారని పేర్కొన్నారు. ప్రధానంగా ఇరువర్గాల వాదనలు బార్ కౌన్సిల్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

చెక్‌పోస్ట్ బంద్

పెనుకొండ: పట్టణ సమీపంలో 44వ జాతీయ రహదారిపై పులేకమ్మ గుడి వద్ద ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టును ఉన్నతాధికారులు మూసి వేయించారు. ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే చెక్‌పోస్ట్‌ను మూసి వేయించిన ఉన్నతాధికారులు ఇందులో పని చేసే సిబ్బందిని ఇతర ప్రాంతాలకు కేటాయించారు. ఎన్నికల వేళ రవాణా వ్యవస్థ ద్వారా జరిగే అక్రమాలను అరికట్టడానికి అధికారులు ఈ చర్యలు చేపట్టారు. తదుపరి ఆదేశాలు వెలువడితే కాని చెక్‌పోస్టును తెరిచే అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన ప్రసాద్

రొద్దం: మండలంలోని కల్లుకుంట గ్రామ సమీపంలో హిందూపురం–కలిపి ప్రధాన రహదారిపై గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో కల్లుకుంటకు చెందిన దాసరి ప్రసాద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దాసరి ప్రసాద్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



రొళ్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ రాజకుమార్

రొళ్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని మడకశిర సీఐ రాజకుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా కాకి గ్రామంలో మంగళవారం అనుమానాస్పదంగా యువతి మేఘన (20) మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. దీంతో ఆమె తల్లి రాధమ్మ అదే గ్రామానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా సీఐ రాజకుమార్, ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి వెళ్లి మేఘన మృతి చెందిన ఇంటిని పరిశీలించారు. గ్రామస్తులతో మేఘన మృతికి కారణాల పై ఆరా తీశారు. పోస్టు మార్టం నివేధిక ఆధారంగా దర్యాప్తు చేపట్టి నింధితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కె.బ్యాడిగెర, పిల్లిగుండ్ల వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జమేదార్లు రామలింగప్ప, ముత్యాలప్ప, రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలి. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ ప్రాంగణంలోని భువన విజయం సమావేశ భవనంలో పోలీసులు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్ అమల్లోకి తెచ్చిందన్నారు. పోలీస్ సిబ్బంది, రెవెన్యూ యంత్రాంగం కాని కోడ్ నిబంధనలు ఉల్లంఘించే ప్రక్రియలపై నిఘా ఉంచాలన్నారు. ఇందుకు సంబంధించిన వాట్సాప్ నంబర్లను తెలియజేశారు. ఎన్నికల నిబంధలను ఉల్లంఘించి వాహనాలను ప్రచారంలో వాడటం, అదేవిధంగా సభలు, సమావేశాల్లో ఉల్లంఘనలపై నిశితంగా దృష్టి సారించాలన్నారు. పోలీసులు, ఏఈఆర్‌ఓలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక భద్రతా బలగాలతో ధర్మవరం డీఎస్పీ పృథ్వీతేజ, రామగిరి సీఐ శివ ఆంజనేయులు కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న భద్రతా సిబ్బంది గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పృథ్వీతేజ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిబంధనలు అతిక్రమించరాదన్నారు. పోలింగ్ జరిగే వరకూ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసరంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసులు గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారన్నారు. సమావేశంలో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'చెట్ల తొలగింపుతో మాకు సంబంధం లేదు'

పెనుకొండ: స్థానిక దర్గాపేట సమీపంలోని ఇసుక వంక ప్రాంతంలో సర్వే నంబర్ 219 స్థలంలో ఇంటి సమీపంలో చెట్లు తొలగింపు, స్థలం కబ్జా విషయంలో తమకు సంబంధం లేదని కానిస్టేబుల్ బాలాజీ సోదరి వైష్ణవి, ఆయన తల్లి సుబ్బమ్మ గురువారం తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు సంచరించే ప్రాంతంలో పద్మావతి అనే స్కూల్ అసిస్టెంట్ చెట్లు నాటడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. పలుమార్లు చెప్పినా వినకపోవడంతో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తొలగించారన్నారు. పోలీసులు సైతం సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారని పేర్కొన్నారు. ఇందులో తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. పద్మావతి తమపై లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మదనమోహన్ రెడ్డి



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.మదనమోహన్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అబూబకర్ గురువారం సాయంత్రం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బి.మోహన్ నాయక్, కార్యదర్శిగా జి.శరత్‌బాబు, జాయింట్ సెక్రటరీగా వైసీ.అశ్వర్థ నారాయణ, ట్రెజరర్‌గా రాజేష్‌నాయక్, లైబ్రేరియన్ సెక్రటరీగా ఎస్.విశ్వనాథ నాయక్, ఎగ్జిగ్యూటివ్ మెంబర్లుగా జి.దయానందరెడ్డి, సీఆర్.నాగార్జున, వి.ధర్మేంద్రరెడ్డి, బి.కృష్ణమూర్తి, బి.శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ బార్ కౌన్సిలర్ ఆదేశాల మేరకు ఈనెల 15న నామినేషన్ల స్వీకరణ, 18న నామినేషన్ల పరిశీలన, 20న నామినేషన్ల విత్‌డ్రా, 21న కౌంటింగ్ చేపట్టినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇతర కార్యవర్గ సభ్యుల పదవులకు ఒకే సెట్ నామినేషన్లు రావడంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏజీపీ భాస్కరరెడ్డి, సుదర్శన రెడ్డి చంద్రశేఖర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, శేషశర్మ, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తెలిపారు. మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమంపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప పాల్గొంటారని, పార్టీ శ్రేణులందరూ హాజరు కావాలని కోరారు.

రైతు సేవలను మరింత విస్తృత పరచండి

పుట్టపర్తి అర్బన్: రైతులకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ ముద్రించిన వార్షిక డైరీలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, వాటిని రైతులకు సక్రమంగా అందించాలన్నారు. ఏఓ నటరాజ్, సంఘం సభ్యులు కౌశిక్, అంజిబాబు నాయక్, త్రినాథ్‌రెడ్డి, బృందావని, షానవాజ్, రఘు, నిఖిల్ తదితరులు ఉన్నారు.

సమాజ సేవకుడు ధర్మపాల్ మృతి



ధర్మపాల్ (ఫైల్)

పావగడ: స్థానిక సమాజ సేవకుడు, శనిమహాత్మ కార్య నిర్వాహక సంఘం మాజీ అధ్యక్షుడు జీ ఎస్ ధర్మపాల్ (90) కన్ను మూశారు. కొన్నాళ్లుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. బెంగుళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్ల వారుజామున మృతిచెందారు. స్థానిక మున్సిపల్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. 40 ఏళ్లపాటు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై పట్టణాన్ని అభివృద్ధి దిశగా నడిపించారు. స్థానిక శ్రీ శని మహాత్మ కార్య నిర్వాహక సంఘం అధ్యక్షుడిగా 1998 నుంచి 22 ఏళ్ల పాటు సుదీర్ఘంగా ధార్మిక సేవలందిస్తూ శని మహాత్మ ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన హయాంలోనే ఎస్ఎస్‌కే సముదాయ భవనం, అతిథి గృహం, ఎస్ఎస్‌కే బయలు రంగ మందిరం , అన్నపూర్ణ దాసోహ భవనం, ఎస్ఎస్‌కే శాంతి విద్యా సంస్థలు ఏర్పడ్డాయి. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితర నాయకులు సంతాపం ప్రకటించారు.

పారిశుధ్య కార్మికుడికి ఆర్థికసాయం

పరిగి: మండలంలోని శ్రీరంగరరాజుపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న గుడ్డి హనుమయ్య (60) గత మంగళవారం రాత్రి అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేదవతి నరసింహారెడ్డి తదితరులు హనుమయ్య మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ పార్లమెంటరీ కార్యదర్శి కిరణ్, ఎంపీటీసీ సునితాశ్రీనివాసులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పరిగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రౌడీ షీటర్లకు ఎస్ఐ సత్యనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రతి గ్రామంలోనూ ప్రశాంతయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి



కనకదాస విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అనంతరాజు

మడకశిరరూరల్: కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు తెలిపారు. మండలంలోని హారేసముద్రం గ్రామంలో కనకదాసు విగ్రహానికి గురువారం పూలమాల వేసి, పూజలు నిర్వహించారు. అనంతరం కురుబలు ఘనంగా సన్మానించి, మెమొంటో అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, కురుబ సంఘం నాయకులు దొడ్డయ్య, ఈశ్వర్, నాగరాజు,కురుబ కులస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో భోజనం చేస్తున్న గర్భిణులు

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు రాజ్‌కుమార్, వెంకటచిరంజీవి గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. అనంతరం కరణం రమానందన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: 2024–25 విద్య సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.